# యాక్సిడెంట్

**నేనెక్కిన ఆర్టీసీ బస్సు ఓ మోస్తరు స్పీడుతో పోతోంది. లేడీస్ సీట్ల వెనక సీట్లో కిటికీ పక్కన కూర్చున్నాను. కిటికీగుండా ప్రకృతి రమణీయ దృశ్యాల్ని చూసి పరవశించిపోయే సీన్‌లేదు. ఎందుకంటే ఆ రూట్లో ప్రతీ రోజూ నేను తిరుగుతున్నవాణ్ణే.**

ముందు సీట్లో ఇద్దరు నడి వయసు స్త్రీలు కూర్చుని కబుర్లాడుకుంటున్నారు.

కండక్టర్ వచ్చి టికెట్ అని అడగడంతో డబ్బులిచ్చి టికెట్ కొనుక్కుని చిల్లర తీసుకున్నాను. బస్సు రద్దీగా లేకపోవడంతో ప్రయాణికులు ఎక్కువమంది సాధారణంగా కిటికీ పక్కన కూర్చోవటానికి ఇష్టపడతారు కాబట్టి నేను కూర్చున్న సీట్లో నేను తప్ప పక్కన మరెవ్వరూ లేరు. టైం పాస్ కోసం, బస్సులో ఎవరైనా పేపర్ చదువుతున్నారేమో చూస్తే ఆ జాడ కూడా లేదు. ఇంతలో అనుకోకుండా అప్రయత్నంగానే నా ముందు సీట్లో మహిళలు మాట్లాడుకుంటున్న కబుర్లు చెవినపడ్డాయి. వారి సంభాషణ ఇంట్రెస్టింగా ఉండటం వల్ల ఆత్రంగా వినక తప్పింది కాదు.

''ఎంత ముద్దుగా ఉంటుందేం, ఆ పిల్ల!'' ఒకావిడ అంది.

''ఆ..చక్కదనాల పిల్లని లారీ ఢీకొంటే నాకు ఏడుపొచ్చేసింది'' రెండో ఆవిడ.

''ఏడుపొచ్చేయడమంటా వేంటి, నేను ఏడ్చేసాను తెలుసా. మా అత్తగారైతే నేను చూడలేనని కళ్లు మూసేసుకున్నారు''

''పిల్లని రక్షించడానికి ఎవరికీ చేతులు రాలేదు''

''నేననుకున్నాను, ఆ బడ్డీకొట్టు దగ్గర వాళ్ళెవరైనా పరిగెట్టుకెళ్ళి ఇటువైపు లాగేస్తారేమో అనుకున్నాను''



''గుద్దేయక ముందు ఎవరూ చూడలేదు. పిల్ల చచ్చిపోయేక అందరూ చూసారు. గుమిగూడిపోయేరు''

ఇలా సాగుతున్న వాళ్ళ సంభాషణ నా మనసుని చివుక్కుమనిపించింది.

'ఎవరి పిల్లో కదా, అర్ధాయుష్షుతో వెళ్ళిపోయింది' అని బాధపడ్డాను. ఆ తల్లిదండ్రులెంతగా ఏడుస్తున్నారో అని తలచుకుని కుమిలిపోయాను. పిల్ల వయసెంతో, చిన్న పిల్ల అయితే ఒక్కర్తిని రోడ్డు మీదకి ఎందుకు పంపారో అని కోపమొచ్చింది నాకు. ఇంతకీ ఈ యాక్సిడెంట్ ఎక్కడ జరిగిందో, తప్పు డ్రైవరుదో, పిల్లదో, అయినింటి బిడ్డో, పేదపిల్లో అని నా మనసు పరిపరి విధాల పోయి వివరాల కోసం తహతహలాడింది.

అపరిచిత స్త్రీలయినప్పటికీ చిన్నపాటి చనువుతో ''మేడమ్ యాక్సిడెంట్ అంటున్నారు. ఏమిటీ? ఎక్కడ?'' అని అడిగేసాను.

వాళ్ళిద్దరూ ఒక్కసారిగా వెనక్కి తిరిగి నా వైపు అదోలా చూసారు. ఆ చూపునకు భావం నాకు బోధపడలేదు. వాళ్ళల్లో వాళ్ళు చిన్నగా నవ్వుకున్నారు. ఏడుపొచ్చేసిన వాళ్ళకి ఇంత సడెన్‌గా నవ్వెందుకొచ్చిందో అర్ధం కాలేదు. నా మొహంలో మాత్రం అదే క్వశ్చన్ మార్కు వివరాల కోసం ఏంగ్జయిటీ.

గమనించి జవాబు చెప్పారు, ''బయట కాదండీ, టీవీ సీరియల్లో'' అని.

''టీవీ సీరియలా?'' అని నోరెళ్ళబెట్టడం నా వంతయింది.

**-కె.వి. సన్యాసిరావ్**
(అలమండ)



